ఈనాడు
నారాయణపేట
గురువారం అక్టోబరు 24, 2024

భారాస పాలనలో అప్పుల కుప్పగా రాష్ట్రం: మంత్రి



ర్యాలీలో మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పుర ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్

పాలమూరు, న్యూస్‌టుడే : తెలంగాణను అప్పులకుప్పగా మార్చిన భారాస నేతలు.. రాష్ట్రాన్ని బంగారు పల్లెంలో పెట్టి ఇచ్చామని చెబుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో ముడా (మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఛైర్మన్‌గా లక్ష్మణ్ యాదవ్ బాధ్యతలను స్వీకరించిన అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారాస రూ.వేల కోట్లు దోచుకుని దేశంలోని జాతీయ పార్టీల కంటే ఎక్కువగా సంపద పోగేసుకుందని ఆరోపించారు. గత 75 ఏళ్లుగా అనేక పార్టీలు రాష్ట్రాన్ని పాలించినా రూ.70వేల కోట్ల అప్పే అయ్యిందన్నారు. భారాస పాలనలో రూ.6.5 లక్షల కోట్ల అప్పు చేశారని దుయ్యబట్టారు. అందుకే నిరంకుశ, కుటుంబ పాలనను ప్రజలు తిరస్కరించి తమకు పాలన అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటే కుటుంబ పార్టీ కాదని, బడుగు బలహీన వర్గాలకు చెందిన పార్టీ అని పేర్కొన్నారు. లక్ష్మణ్ యాదవ్ రెండుసార్లు కౌన్సిలర్‌గా ఎంపికయ్యారని, ఆయనతోపాటు గెలిచిన వారంతా వేరే పార్టీలో చేరినా కాంగ్రెస్ జెండానే నమ్ముకొని ఉన్నారని గుర్తుచేశారు. అందుకే పార్టీ సముచిత ప్రాతినిధ్యం ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారాస ప్రభుత్వం ముడా ఏర్పాటు చేసినా దానికి రూపాయి కూడా మంజూరు చేయలేదని మండిపడ్డారు. ముడాను అభివృద్ధి చేయడానికి ముగ్గురం ఎమ్మెల్యేలం కలిసి ముఖ్యమంత్రి సహకారంతో ఎక్కువ నిధులు తీసుకొస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.260 కోట్ల అమృత్ నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. యాదవులు నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారని, ప్రాధాన్యమైన పోస్టును యాదవ బిడ్డకు అప్పగించామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జడ్పీ, ఎంపీపీ, పురపాలికల్లో పదవులు అన్ని వర్గాలకు దక్కేలా కృషిచేస్తామన్నారు. తొలుత ముడా కార్యాలయంలో ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్ బాధ్యతలు చేపట్టగా మంత్రి, ఎమ్మెల్యేలు, నేతలు అభినందనలు తెలిపారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి సమావేశం నిర్వహించిన ఏనుగొండలోని జేజేఆర్ గార్డెన్ వరకు భారీ వాహన ర్యాలీతో తరలివెళ్లారు. కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, మల్లు నర్సింహారెడ్డి, ఆనంద్‌కుమార్ గౌడ్, అనిత, ఎన్పీ వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, అబ్దుల్ సిరాజ్ ఖాద్రి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని పుర కమిషనర్ నాగరాజు కోరారు. బుధవారం కోస్గి పట్టణంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ ప్రాంతం, నాగులబావి సమీపంలోనూ ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ స్థలాలకు సంబంధించి రెవెన్యూ అధికారులు నిర్ణయించిన హద్దులు, ఇదివరకే నిర్మించిన ఇళ్ల వివరాలను సమీక్షించారు. రోడ్లపై చెత్తను సులువుగా తొలగించే కొత్త యంత్రం పనితీరును స్వయంగా పరిశీలించారు. మేనేజర్ యాదయ్య, సిబ్బంది బలరాం, విజయభాస్కర్, రము ఉన్నారు.



రోడ్లపై చెత్తను తొలగించే యంత్రాన్ని పరిశీలిస్తున్న పుర కమిషనర్ నాగరాజు

గవర్నర్‌ను కలిసిన పీయూ ఉపకులపతి

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మను పాలమూరు విశ్వ విద్యాలయం



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్

నూతన ఉపకులపతి డా.జీఎన్ శ్రీనివాస్ హైదరాబాద్ రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో పాటు పలు విశ్వ విద్యాలయాల ఉపకులపతులు బుధవారం గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం కోసం రైతుల ధర్నా

ధన్వాడ, న్యూస్‌టుడే : ప్రభుత్వ మద్దతు ధరతో కూడిన సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ధన్వాడలోని రైతు వేదిక వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. పక్షం రోజులుగా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతుండటంతో ప్రధాన ద్వారం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. ప్రైవేటు పత్తి మిల్లు యజమానులు ధర నిర్ణయంలో మోసం చేస్తున్నారన్నారు. నాయకులు సుదీర్‌కుమార్, గౌని శ్రీనివాస్, శివారెడ్డి, మల్లేష్‌గౌడ్, టైలర్ శ్రీనివాస్‌గౌడ్, సచిన్, ఇర్ఫాన్‌తో పాటు పలుగ్రామాల రైతులు పాల్గొన్నారు. తహసీల్దారు సింధూజకు వినతిపత్రం ఇచ్చారు.



ధన్వాడ రైతు వేదిక వద్ద ధర్నా చేస్తున్న కర్షకులు

ఏడాదిగా జాడలేని నిధులు

ఆరోగ్య మిషన్ అమలులో నిర్లిప్తత

న్యూస్‌టుడే– నారాయణపేట

ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ కింద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఏటా రూ.కోట్లలో నిధులు సమకూరుస్తోంది. జిల్లాల వారీగా వైద్య ఆరోగ్యశాఖకు ఈ నిధులు బదిలీ చేస్తారు. ఏడాదిగా నిధుల మంజూరులో తీవ్ర నిర్లిప్తత నెలకొంది. ఆరోగ్యమిషన్ నిధులను ప్రతి జిల్లా ఆస్పత్రి, సీహెచ్‌సీలకు రూ.4.50లక్షల చొప్పున, పీహెచ్‌సీకి రూ.1.75 లక్షలు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ప్రతి జిల్లాకు ఏటా కార్యక్రమాల నిర్వహణకు రూ.3కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు నిధుల మంజూరు చేయాల్సి ఉంది. ఇంతే కాకుండా ఆస్పత్రుల భవనాలకు, ఇతర కార్యక్రమాలకు అదనపు నిధులు పరిస్థితుల మేరకు వెచ్చిస్తారు. నిధుల్లేక ఏ కార్యక్రమం నిర్వహించాలన్న ఆరోగ్యశాఖ తలలు పట్టుకోవాల్సి వస్తోంది.



నారాయణపేట: కొల్లంపల్లిలో నిరుపయోగంగా పల్లె దవాఖానా



జిల్లా	పీహెచ్‌సీలు
మహబూబ్‌నగర్	17
నారాయణపేట	11
నాగర్‌కర్నూల్	23
జోగులాంబ గద్వాల	10
వనపర్తి	14

జననీ సురక్ష, శిశు యోజన...: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సందర్భంలో మందుల కొనుగోలుకు ఇది వరకు ఒక్కో కేసుకు రూ.1600లు ఖర్చుచేసేవారు. భోజనం ఖర్చుల కింద రోజుకు రూ.వంద వరకు వెచ్చించాలి. సాధారణ ప్రసవానికి మూడు రోజులు, శస్త్ర చికిత్స జరిగితే ఏడు రోజులకు చెల్లించేవారు. కేసీఆర్ కిట్ పేరు మార్చినా నిధులు అందని పరిస్థితి ఉంది.

పారిశుద్ధ్యం అంతంతే: 5వేల జనాభా ఆధారంగా ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటి నిర్వహణకు జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి యేటా నిధులు మంజూరవుతాయి. ఒక్కో కేంద్రానికి రూ.10వేలు కేటాయిస్తారు. కేంద్రం పరిధిలో పారిశుద్ధ్యం, ఇతరత్ర సౌకర్యాలకు నిధులను వినియోగించాల్సి ఉంటుంది. ఏడాదిగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది.

కొనసాగని కు.ని శిబిరాలు...: కు.ని శిబిరాల నిర్వహణ, అవసరమైన వసతులు , శస్త్రచికిత్స చేసుకున్న మహిళలకు రూ.800, పురుషులకు రూ.1100 ప్రోత్సాహకం అందజేసేవారు. నిధుల లేమితో రెండేళ్లుగా కు.ని శిబిరాలు నిర్వహించడంలేదు.

పీహెచ్‌సీలలో వసతులు కరవు....: మిషన్ నిధుల జాడలేకపోవడంతో ఆస్పత్రి కమిటీలు ఉత్సాహంగా పనిచేయడం లేదు. వైద్యాధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేక సమావేశాలే జరగడం లేదు. పీహెచ్‌సీలలో ఏ చిన్న సమస్య వచ్చినా సొంత ఖర్చులతో నెట్టుకొస్తున్నామని పలువురు వైద్యాధికారులు వాపోతున్నారు.


14 రకాల కార్యక్రమాలు

1 శిశు, మాతృ మరణాల రేటు తగ్గించడం
2. పారిశుద్ధ్యం మెరుగుపరచడం
3. అంటువ్యాధుల నివారణ
4. అసంక్రామిక వ్యాధులపై దృష్టి
5. మలేరియా, డెంగీ రాకుండా చూడటం
6. మరణాల తగ్గింపు
7. కుష్ఠు, క్షయవ్యాధి నివారణ
8. పిల్లల ఆరోగ్యం
9. సార్వత్రిక వ్యాధి నిరోధక సేవలు
10. వ్యక్తిగత పరిశుభ్రత పెంపు
11. కీటక జనిత వ్యాధుల నివారణ
12. కుటుంబ సంక్షేమం
13. గర్భిణుల ఆరోగ్యం
14. బాలింత సంరక్షణ

నిలిచిన ఉపకేంద్రాల నిర్మాణాలు...
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 352 ఆరోగ్య ఉపకేంద్రాలకు ఒక్కో భవనానికి రూ.16లక్షల నుంచి రూ.20లక్షలకుపైగా నిధులు కేటాయించారు. వీటిలో 94 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, 30 నిర్మాణాలు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. నిధుల కొరతతో పనులకు నోచుకోవడం లేదు. పూర్తైన భవనాలను గుత్తేదారులు నిధులు రాలేదని వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించడంలేదు.

నక్షా.. భూమి లెక్క పక్కా!

పైలట్ ప్రాజెక్టుగా జడ్చర్ల



ఈనాడు, మహబూబ్‌నగర్: గ్రామాల్లో వ్యవసాయ భూముల వివరాలు నక్షాలో పకడ్బందీగా ఉంటాయి. పట్టణాల్లో ఆ వ్యవస్థ లేకపోవడంతో ఇష్టారీతిన భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇతరత్రా భూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలాంటి ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు పట్టణ భూములకూ నక్షాను అందుబాటులోకి తీసుకురానున్నారు. కేంద్రం పైలట్ ప్రాజెక్ట్‌గా దేశంలోని దాదాపు వంద మున్సిపాలిటీలను ఎంపిక చేయగా రాష్ట్రం నుంచి ఎనిమిది ఉన్నాయి. వీటిలో పాలమూరు నుంచి జడ్చర్ల మున్సిపాలిటీ ఎంపికైంది. త్వరలోనే పట్టణంలో సర్వే ప్రారంభం కానుంది.

సర్వే చేపట్టి.. : భూముల వివరాలను నక్షాలో పొందుపర్చేందుకు సర్వే చేపట్టి పటాలు(మ్యాప్స్) రూపొందించనున్నారు. సర్వే ఆఫ్ ఇండియా, పురపాలక, భూమి కొలతలు దస్త్రాల నిర్వహణ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేపట్టనున్నాయి. కేంద్ర పథకం నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ హ్యాబిటేషన్స్(ఎన్ఏకేఎస్‌హెచ్) కింద పట్టణాలకు నక్షా తయారు చేయనున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే సర్వే ఆఫ్ ఇండియా డ్రోన్లతో ఎంపికైన పట్టణాల్లో ఛాయాచిత్రాలు రూపొందిస్తోంది. అనంతరం ఆయా శాఖలు సంయుక్త సర్వే చేపట్టనున్నాయి. ఇళ్లు, భూములు, ఆస్తిని పక్కాగా నమోదు చేస్తారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్తుల హద్దులు గుర్తిస్తారు. వాటి విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తారు. ఇల్లు, ఆస్తికి ప్రాపర్టీ కార్డులను కూడా జారీ చేయనున్నారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట : జడ్చర్ల పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండటం, పట్టణం మీదుగా జాతీయ రహదారి వెళ్లడం, హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం తదితర సానుకూలాంశాల వల్ల ఇక్కడి భూములకు డిమాండ్ పెరిగింది. అక్రమార్కులు ఇక్కడి ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. నక్షాలో ప్రతిదానికి డిజిటల్ హద్దులు నిర్ధారిస్తారు. దీనివల్ల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయవచ్చు. ● జడ్చర్ల పురపాలికలోని నల్ల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. దీని బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో వెంచర్లలో చెరువు నీరు నిండిపోతోంది. కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. పరిసరాల్లో కొన్ని నిర్మాణాలు కూడా చేశారు.

జడ్చర్ల మున్సిపాలిటీ జనాభా: సుమారు లక్ష
వార్డులు: 27
పట్టణంలోని భవనాల సంఖ్య: 11 వేలు

● పట్టణంలోని ఊర చెరువు, నల్లకుంట, ఊరకుంట చెరువులు కబ్జా అయ్యాయి. ● బూరెడ్డిపల్లిలో కొన్ని సర్వే నంబర్లలో ప్రభుత్వ భూములు, గుట్టలున్నాయి. వాటి పరిధిలో ఎలాంటి తవ్వకాలు, గనుల ఏర్పాటు, పేలుళ్లు చేపట్టకూడదు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను కలిపేసుకుంటున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు.

● కోసిగుట్ట సమీపంలోనూ కుంటలు, ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయి. సర్వే ద్వారా ఈ అక్రమాలు వెలుగు చూస్తాయి.

● బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో 14 ఎకరాల స్థలం ఉంది. అందులో మార్కెట్ కార్యాలయం, షెడ్లు, ఇతర నిర్మాణాలున్నాయి. రైతులు ఇక్కడికి ధాన్యం, పంట ఉత్పత్తులు తీసుకొచ్చేందుకు 100 అడుగుల విశాలమైన రహదారులుండాలి. మార్కెట్ చుట్టూ నిర్మాణాలు చేస్తున్నారు. ఆ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. రైతులు రాకపోకలు, వాహనాల నిలిపేందుకు స్థలాలు కరవయ్యాయి. రహదారులు ఇరుకుగా మారాయి.

● పట్టణ భూములు, ఆస్తుల సర్వే నిర్వహణకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. సర్వే వల్ల భూముల లెక్కలు పక్కాగా నమోదవుతాయి. భూ సమస్యలను నివారించవచ్చు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే, వాటిని అనుసరించి సర్వే చేపడతాం.
- నవీన్, ఆర్డీఓ మహబూబ్‌నగర్

భూసేకరణ త్వరితగతిన పూర్తిచేయాలి

కలెక్టరు సిక్తా పట్నాయక్



అంగన్వాడీలో చిన్నారితో చిత్రం గుర్తింపజేస్తున్న కలెక్టర్

నారాయణపేట, న్యూస్‌టుడే : భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో భూసేకరణ కార్యాలయ అధికారులు, నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజీవ్ ఎత్తిపోతల పథకం-1 కింద 82.35 ఎకరాల భూసేకరణకు సంబంధించి కోర్టులో డిపాజిట్ చేసిన నష్టపరిహారం డబ్బులు రైతులకు అందాయా? అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా 57.44 ఎకరాలు పెండింగ్‌లో ఉన్న భూసేకరణను వేగిరం చేయాలని ఆదేశించారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పరిధిలోని 49.80 ఎకరాల భూసేకరణ ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్ విశాలాక్షి, మహబూబ్‌నగర్ నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ రమణారెడ్డి, ఎస్ఈలు చక్రధరం, సత్యశీలారెడ్డి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల వసతిగృహం పరిశీలన

అన్ని సౌకర్యాలతో వైద్యకళాశాల వసతి గృహాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బృందావన్ కాలనీలో వసతి గృహాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. పనులను వెంటనే పూర్తిచేయాలని గుత్తేదారుకు సూచించారు. భవనం చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేయాలని, ఆవరణలో యోగా, జిమ్ కోసం శ్లాబ్ వేయించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.రాంకిషన్, శిక్షణ కలెక్టర్ గరిమా నరుల పాల్గొన్నారు.

ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో ..

ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. నర్సరీ, ఎల్‌కేజీ పిల్లలకు ఆటపాటల ద్వారా చేస్తున్న విద్యా బోధనను పరిశీలించారు. మక్తల్‌లో రూ.5లక్షలతో ఆదర్శ అంగన్వాడీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని డీడబ్ల్యూవోను ఆదేశించారు. అనంతరం జాజాపూర్ ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీని సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. ఓ చిన్నారి చెప్పిన కోడిపిల్ల కథను విన్న కలెక్టర్ ఆమెను అభినందించారు. కేంద్రంలో ఫ్యాన్, విద్యుత్తు సౌకర్యం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నల్లమలలో ఆక్రమణలకు అడ్డుకట్ట!

అటవీ భూముల్లో విస్తృతంగా మొక్కల పెంపకం

కొల్లాపూర్, న్యూస్‌టుడే : అటవీ భూముల ఆక్రమణల నివారణకు అటవీశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో విస్తరించిన నల్లమల అడవుల అభివృద్ధిలో భాగంగా కొల్లాపూర్ రేంజ్ పరిధిలో విస్తృతంగా మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఆక్రమిత భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకొని మొక్కల పెంపకానికి సిద్ధం చేస్తున్నారు.



ఎర్రగట్టు బొల్లారం శివారులో మొక్కలు నాటుతున్న సిబ్బంది

ఎక్కడెక్కడ.. : కృష్ణా నదీ పరివాహక ప్రాంతం, వాగులకు సమీపంలోని అటవీప్రాంతాల్లోనూ మొక్కల పెంపకం చేపట్టనున్నారు. ప్రస్తుతం నల్లమలలోని ఎర్రగట్టుబొల్లారం శివారులో మొలచింతలపల్లి వాగు సమీపంలో 25 ఎకరాల్లో మొక్కలు నాటారు. వీటి పరిరక్షణకు చర్యలు చేపడుతున్నారు. మిగతా అటవీ భూముల్లో ప్రధానంగా తీరప్రాంతాలైన అమరగిరి, సోమశిల, మల్లేశ్వరం, మంచాలకట్ట, తదితర గ్రామాల్లో నదీ తీర ప్రాంతంలోని అటవీ శాఖ భూముల్లో మొక్కల పెంపకం చేపట్టడానికి అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల ప్రజలకు అడవుల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. చెట్లను నరకకుండా నిఘా తీవ్రతరం చేశారు. ముక్కిడిగుండం, మారెడ్‌మాన్‌దిన్నె, నార్లాపూర్ తదితర గ్రామాల్లో చెట్లు నరికి పంట సాగు చేసిన పలువురిపై ఇప్పటికే 20 కేసులు నమోదయ్యాయి. ఈ సమస్యపై కొల్లాపూర్ రేంజ్ అధికారి చంద్రశేఖర్ స్పందిస్తూ హక్కుపత్రాలు ఉన్న పోడుభూముల్లో పంటల సాగు చేసుకోవాలన్నారు. కానీ అటవీశాఖకు చెందిన భూముల్లో అక్రమ సాగు చేసే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

న్యూస్‌టుడే– పాతబస్టాండ్(నారాయణపేట)

మాగనూరులో అనుమతి లేకుండా రోగ నిర్ధారణ పరీక్షలు చేసే ల్యాబ్‌ను డీఎంహెచ్‌వో మంగళవారం సీజ్ చేశారు. కొన్ని రోజుల క్రితం మరికల్‌లో ఎలాంటి అర్హతలు లేకుండా పడకలు నిర్వహిస్తున్న ఆస్పత్రికి అపరాధ రుసుం విధించారు. జిల్లాలో అనుమతి లేకుండా వైద్యం చేయడం, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ప్రజారోగ్యంతో చెలగాటం ఆడటమే.

జిల్లాలో ఆర్ఎంపీలు తమ స్థాయికి మించి వైద్యం చేస్తూ రోగులతో చెలగాటం ఆడుతున్నారు. మరికొంతమంది నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఆర్ఎంపీల ముసుగులో వైద్యం చేస్తున్నారు. అబార్షన్లు చేయడం, అత్యధిక మోతాదులో యాంటీబయాటిక్స్ ఇవ్వడం, చిన్న రోగాలకు కూడా ఎక్కువ మందులు రాయడం చేస్తున్నారు. వీరికితోడు అనుమతిలేని డయోగ్నోస్టిక్స్(రోగ నిర్ధారణ) కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో కనీసం నిపుణులు ఉండరు. ఆర్ఎంపీలకు సహాయకులుగా పనిచేసిన వారు సైతం గ్రామాల్లో సొంతంగా క్లినిక్‌లు ఏర్పాటు చేయడం ఆందోళనకు గురిచేస్తోంది.



మాగనూరులో ల్యాబ్‌ను సీజ్ చేసిన వైద్యశాఖ అధికారులు(పాతచిత్రం)

నిబంధనలు ఉల్లంఘన

ఆర్ఎంపీలు స్వయంగా రోగ నిర్ధారణ చేసే మందులు ఇవ్వకూడదు. ఇంజక్షన్లు కూడా చేయకూడదు. రోగులకు మందుల చీటీని (ప్రిస్క్రిప్షన్) రాయకూడదు. సెలైన్ సీసాలు ఎక్కించకూడదు. తమ క్లినిక్‌లలో అనధికార పడకలు ఏర్పాటు చేసి ఇన్‌పేషంట్లను చేర్చుకోవడం చట్ట విరుద్ధం. ల్యాబ్‌లను నిర్వహించరాదు. అబార్షన్లు, కాన్పుల వంటి క్లిష్టతరమైన చికిత్సల జోలికి పోకూడదు. రోగులను ప్రలోభపెట్టి వైద్యం కోసం ఆస్పత్రులకు సిఫారసు చేయకూడదు. ఏదైనా రోగికి ప్రాథమిక చికిత్స తప్ప ఇంకా ముందుకుపోయి వైద్యం చేయకూడదు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం 2010 ప్రకారం ప్రథమ చికిత్స చేసే ఆర్ఎంపీలు తమ పేరు ముందు డాక్టర్ అని రాసుకోకూడదు. బోర్డులపై ప్రథమ చికిత్స కేంద్రం అని తప్ప క్లినిక్, ఆస్పత్రి, నర్సింగ్ హోం, మెడికల్ సెంటర్ వంటి పదాలు ప్రదర్శించకూడదు. కొంతమంది అర్హతలేని ఆర్ఎంపీలు పట్టణాల్లో కొందరు వైద్యులతో ఒప్పందాలు చేసుకుని రోగులను పంపి సొమ్ము చేసుకున్నట్లు జిల్లా వైద్యశాఖకు ఫిర్యాదులు అందాయి. అయితే జిల్లాలో ఈ నిబంధనలు చాలామంది పాటించడం లేదు. ఎండీ డాక్టరు చేసే స్థాయి వైద్యాలు కూడా గ్రామాల్లో ఎలాంటి అర్హత లేని వారు చేస్తున్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటి షెడ్యూల్డ్ డ్రగ్స్ వాడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆరోగ్య పరీక్షలు చేసే కొన్ని కేంద్రాల్లో కనీస సదుపాయాలు ఉండవు. పరీక్షలు కూడా పూర్తిస్థాయి నిక్కచ్చిగా ఉండవు. ఈ నివేదికల ఆధారంగా మందులు రాయడంతో రోగుల పరిస్థితి మరింత విషమిస్తోంది. పరిస్థితి చేయిదాటాక ప్రైవేటు ఆస్పత్రులకు సిఫారసు చేస్తున్నారు.

నోటీసులు జారీ చేశాం

జిల్లాలో అర్హతలు, అనుమతులు లేకుండా వైద్యం చేస్తున్నవారిపై ఉక్కుపాదం మోపుతున్నాం. చాలా మంది నకిలీ డిగ్రీలు పెట్టుకుంటున్నట్లు మా దృష్టికి రావడంతో తనిఖీలు చేశాం. కొంతమందికి అపరాధ రుసుము విధించాం. పరిజ్ఞానం లేనివారు ఎక్స్‌రేలు తీయడం, రక్తపరీక్షలు చేయడం, రోగనిర్ధారణకు సిద్ధం కావడం తగదు. వీరిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– డా.సౌభాగ్యలక్ష్మి, జిల్లా వైద్యాధికారి, నారాయణపేట

రక్తదానానికి యువత ముందుకు రావాలి : డీఐజీ

పాలమూరు, న్యూస్‌టుడే : గర్భిణులు, రోడ్డు ప్రమాద క్షతగాత్రులు, ఇతర రోగులకు రక్తం అవసరముంటుందని, వారిని యువత రక్తదానంతో ఆదుకోవాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ పిలుపునిచ్చారు. పాలమూరు పోలీసు కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదాతలు కావాలని కోరారు.

రేపటి శాస్త్రవేత్తలకు చక్కని అవకాశం

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ దరఖాస్తులకు ఆహ్వానం

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్ : విద్యార్థులు బృందంగా, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ప్రాజెక్టుల రూపకల్పన చేసేలా కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్' పేరుతో 2024-25 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్, ఏటీఎల్ ఇన్నోవేషన్ మిషన్, యూనిసెఫ్, కేంద్ర పరిధిలోని ఇన్నోవేషన్ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిపై ఇప్పటికే జిల్లా సైన్సు అధికారులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది దోహదపడుతుందని గద్వాల జిల్లా సైన్సు అధికారి బాస్కర్ పాపన్న అంటున్నారు.



వివరాలు నమోదు చేసే వెబ్‌సైట్ ముఖచిత్రం

తేదీలు, ఎంపికలు

నవంబరు 30 నాటికి ప్రాజెక్టుల రూపకల్పన చేసి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి. వాటిని పరిశీలించి 2025 జనవరిలో 1000 మంది విజేతలను ప్రకటిస్తారు. మేలో విజేతలకు బహుమతులు అందిస్తారు. జులై 29న దేశవ్యాప్తంగా నిర్వహించే అటల్ ఇన్నోవేషన్ షోలో పాల్గొనాల్సి ఉంటుంది.

- ప్రతి రాష్ట్రం నుంచి 20 బృందాలను విజేతలుగా ప్రకటిస్తారు. ఇందులో 20 బృందాలను గ్రామీణ ప్రాంతాల నుంచి, 20 బృందాలు ప్రభుత్వ పాఠశాలల నుంచి, 20 బృందాలు ఉమ్మడి జిల్లా నుంచి, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి 20 బృందాలను ఎంపిక చేయనున్నారు.

6 నుంచి ఇంటర్ విద్యార్థులకు

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 6 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ అవకాశం ఉంటుంది. అయిదు జిల్లాల పరిధిలో మొత్తం 4,500కి పైగా పాఠశాలలుండగా, 190కి పైగా ఇంటర్ కళాశాలలున్నాయి. 6 నుంచి 10వ తరగతి వరకు 2.40 లక్షల మంది, ఇంటర్‌లో 35 వేల మందికి పైగా ఉన్నారు. వీరంతా పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఒక్కో పాఠశాల నుంచి బృందంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పన చేయాలి. ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే బృందంలో ఉండాలి. schoolinnovation-marathon.org అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే.. విద్యార్థులు, ఉపాధ్యాయునికి ఎంట్రీ కోర్సు నిర్వహిస్తారు. తరువాత వారి ఆలోచనలు అందులో పొందుపరచాల్సి ఉంటుంది.


మానవపాడు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

సామాజిక సమస్యలపై

ప్రాజెక్టులు సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చూపేలా ఉండాలి. ఇప్పటికే పరిష్కారం కనుగొని ఉంటే. ఇంకా మెరుగైన పరిష్కారాలు సూచించేలా ఉండాలి. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక బహుమతులు, ఉన్నత విద్యకు సహకారం అందనుంది.

మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ వృద్ధుడికి ముగ్గురు కుమారులున్నారు. ఏ ఒక్కరూ పట్టించుకోక పోవడంతో జనరల్ ఆస్పత్రిలోని వెళ్లలేని ఊరూ దారులు తెలియక అన్నం తిండి లేక బతికారు. ఇటీవల అనాథలా మరణించారు. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కుమారులు ముందుకు రాలేదు. చివరకు సామాజిక వర్గం పెద్ద మనుషులు జోక్యం చేసుకోవడంతో ఓ కుమారుడు అంత్యక్రియలు నిర్వహించారు. నవాబ్‌పేట మండలానికి చెందిన ఓ వృద్ధురాలి కుమారులు పట్టించుకోకపోవడంతో పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది.

కన్నవారే భారమా..!

తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు

సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేస్తున్న సర్కారు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

ఎన్నో కష్టాలు పడి కని పెంచిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో భారమని కొందరు పిల్లలు భావిస్తున్నారు. వారి ఆలనా పాలనా చూడకుండా గాలికి వదిలేస్తున్నారు. కొందరైతే వారి ఆస్తిపాస్తులను కూడా తమ పేరిట రాయించుకుని ఏకాకిని చేసి ఇంటి నుంచి గెంటేస్తున్నారు. ముదిమి వయసులో ఉన్న వారికి రెండు పూటలా అన్నం కూడా పెట్టని ఉదంతాలు నిత్యం ఏదో ఒకచోట వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై 'న్యూస్‌టుడే' కథనం.





మహబూబ్‌నగర్ జిల్లా జైలు సమీపంలో అనాథగా ఉన్న ఓ వృద్ధుడిని ఆసుపత్రికి తరలిస్తున్న జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది

అండగా చట్టాలు


తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం - 2007 ప్రకారం వయోవృద్ధులైన వారి పోషణ బాధ్యత పిల్లలదే. తమ పోషణ విషయంలో పిల్లలను అడిగే హక్కు తల్లిదండ్రులకు ఉంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973లోని సెక్షన్ 125 ప్రకారం తమను పోషించుకోలేని స్థితిలో తల్లిదండ్రులు ఉంటే చట్టంలో వారి పోషణ కయ్యే ఖర్చులను పిల్లల నుంచి ఇప్పిస్తుంది. తమ పిల్లలపై ఉన్న ప్రేమతో చాలా మంది తల్లిదండ్రులు కేసులు పెట్టడం లేదు. బాధితులైన వృద్ధులకు ప్రభుత్వం చట్ట ప్రకారం ఆసరా కల్పించేందుకు జిల్లా, మండల, పురపాలిక స్థాయిలో వయోవృద్ధుల సంక్షేమ కమిటీలు (సీనియర్ సిటిజన్ కమిటీలు) ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది.

ఆదుకునే అధికారులు..

జిల్లా స్థాయి సీనియర్ సిటిజన్ కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్ ఉంటారు. సభ్యులుగా ఎస్పీ, జిల్లా వైద్యాధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, సీనియర్ సిటిజన్లు (ఇద్దరు మహిళలు,



ఇద్దరు పురుషులు), ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉంటారు. మండల స్థాయి కమిటీ ఛైర్మన్‌గా తహసీల్దారు ఉంటారు. సభ్యులుగా ఎంపీడీవో, ఎస్సై, వైద్యాధికారి, ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల లేక ఇద్దరు సీనియర్ సిటిజన్లు, ఏపీఎం, ఏసీడీపీవో, సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు ఉంటారు. పురపాలికల స్థాయి కమిటీలో కమిషనర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా మెప్మా పీడీ, సీఐ, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, సీడీపీవో, ఇద్దరు ఎన్జీవోల ప్రతినిధులు లేదా ఇద్దరు సీనియర్ సిటిజన్లు సభ్యులుగా ఉంటారు.



ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తే పిల్లలకు నోటీసులు పంపించి, విచారణ అది కాదంటే ద్వారా వాదనలు, సాక్ష్యాలు సేకరిస్తుంది. 90 రోజుల వ్యవధిలో పోషణ ఖర్చుల చెల్లింపునకు ఆదేశిస్తుంది. కేసు పునస్సమీక్షకు, పోషణ ఖర్చులకు ట్రైబ్యునల్ ముందు తర ఉత్తర్వులు జారీ చేయొచ్చు. పోషణ ఖర్చులు మూడు నెలల పాటు ఇవ్వకపోతే ఆ వృద్ధులకు తిరిగి ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తే ట్రైబ్యునల్ ఉత్తర్వులను పాటించని పిల్లలు లేదా బంధువులకు జరిమానా లేక జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది.





తల్లిదండ్రులు, వయోవృద్ధులను సంతానం పోషించకుంటే ఫిర్యాదు చేయొచ్చు. తమ నివసిస్తున్న లేదా సంతానం నివసిస్తున్న ప్రాంతం ఆర్డీవో ట్రైబ్యునల్‌కు లేదా జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారికి ఫిర్యాదు చేయొచ్చు. పోషణ ఖర్చులు ఇప్పించమని దరఖాస్తు చేసుకోవచ్చు. టోల్ ఫ్రీ నంబర్ 14567లోనూ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

ఆస్తిపాస్తులు ముందే రాసివ్వొద్దు..

చాలా మంది తల్లిదండ్రులు తాము జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తిపాస్తులను పిల్లల పేరిట రాసిస్తున్నారు. మలిదశలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన పిల్లలు తల్లిదండ్రులను ఇంటి నుంచి గెంటి వేస్తున్నారు. తొందరపడి తల్లిదండ్రులు తమ ఆస్తిని ముందే వారి పేరిట బదలాయించొద్దని న్యాయమూర్తులు, అధికారులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులకు ఆస్తిపాస్తులుంటే, వారికి సేవలు చేస్తే తదనంతరం ఎలాగూ వారసత్వంగా పిల్లలకే సంక్రమిస్తాయని వారు చెబుతున్నారు. వృద్ధుల పేరిట ఆస్తి ఉంటే పిల్లలు పోషణ విషయంలో పట్టించుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.



కమిటీలు న్యాయం చేస్తాయి..



జిల్లా స్థాయిలో రెండేళ్ల క్రితమే కమిటీలు ఏర్పాటయ్యాయి. మండల స్థాయిలో దాదాపు అన్ని చోట్ల ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం పురపాలికల్లో కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. పిల్లలు పట్టించుకోని తల్లిదండ్రులు ఈ కమిటీలను ఆశ్రయిస్తే న్యాయం చేస్తాయి.

- జరీనా బేగం, జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమాధికారి, మహబూబ్‌నగర్

విద్యావంతులే నిర్లక్ష్యం చేస్తున్నారు



వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్న వారిలో విద్యావంతులు, ఉన్నతోద్యోగులైన పిల్లలే ఎక్కువగా ఉంటున్నారు. పింఛన్లు వస్తున్న తల్లిదండ్రుల ఏటీఎం కార్డులు లాక్కుంటున్నారు. బ్యాంకు రుణం తీసుకుంటున్నామని సంతకాలు చేయించుకుని ఆస్తి తమ పేరిట రాయించుకుని పట్టించుకోవడం లేదు. చాలా కేసులు మా దృష్టికి రాగా కూర్చోబెట్టి పరిష్కరించాం. రెండు, మూడు కేసులు మాత్రం కలెక్టర్, ఎస్పీల ద్వారా ట్రైబ్యునల్ వరకు వెళ్లాయి.

- ఎస్.జగపతి రావు, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు, మహబూబ్‌నగర్



పడవల్లో ప్రయాణం.. పొంచి ఉన్న ప్రమాదం

నదీ విహారం, ప్రయాణాల్లో లైఫ్ జాకెట్లు తప్పనిసరిగా ధరించాలని చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. అధికార యంత్రాంగం ఎంతగా అవగాహన కల్పించినా అటు ప్రజల్లో, ఇటు బోట్ల యజమానుల్లో మార్పు రావడం లేదు. చాలాచోట్ల నదిలో ప్రమాదాలు చోటు చేసుకుని పదుల సంఖ్యలో వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం సోమశిల వద్ద కృష్ణానది నిండుకుండను తలపించేలా ప్రవహిస్తోంది. ఇక్కడ లైఫ్ జాకెట్లు ధరించకుండానే ప్రమాదకరంగా నదీ ప్రయాణం చేస్తున్న దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

కాలుష్యమయం.. రోగాల భయం!

నదిలో స్నానమాచరిస్తే పుణ్యం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. కొల్లాపూర్ మండలంలోని సోమశిల వద్ద కృష్ణానదిలో స్నానం చేస్తే పుణ్యం మాట దేవుడెరుగు రోగాలు వస్తాయేమోనని ప్రజలు భయపడుతున్నారు. సోమశిల వద్ద కృష్ణానదిలోని పవిత్ర జలాలు కలుషితమవుతున్నాయి. పుష్కర ఘాట్ల వద్ద నీరు ఆకుపచ్చ రంగులో చమురు తెట్టు కట్టినట్లు దర్శనమిస్తుంది. అక్కడికి వచ్చే పర్యాటకులు ఆ నీటిని చూసి పుణ్యస్నానం చేసేందుకు జంకుతున్నారు. కాళ్లను కడుక్కుని నదికి నమస్కరించి దీపాలు వదిలి దైవ దర్శనానికి వెళ్లిపోతున్నారు.



ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేస్తామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని సింగిల్ విండో సమావేశం హాల్‌లో టీజీవో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గెటిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అయిదు డీఏలను విడుదల చేయాలన్నారు. జీవో నంబరు 317 సమస్యలను పరిష్కరించాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 144 మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి రప్పించాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను మంజూరు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా రాజశేఖర్‌రావు, అసోసియేట్ అధ్యక్షులుగా ఖాజామైనోద్దీన్, నాగరాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, రాజేశ్‌కుమార్, కార్యదర్శిగా సంజీవను ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గం సభ్యులతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. కొత్త కార్యవర్గంను కలెక్టర్ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

26న మద్దూరులో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన


హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 26న మద్దూరులో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నర్సిములు తెలిపారు. ఇటీవల మరణించిన పార్టీ నాయకుడు కల్లపు సతీశ్ దినకర్మకు హాజరై, ఆయన కుటుంబ సభ్యులను సీఎం పరామర్శిస్తారని చెప్పారు. బుధవారం కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దారు మోహన్‌గౌడ్, ఎస్ఐ రాంలాల్, కాంగ్రెస్ నాయకులు హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు


ముఖద్వారానికి రంగులు వేస్తున్న కార్మికులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పాలమూరు ప్రజల ఆరాధ్యదైవం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నవంబరు 2 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో దేవాదాయశాఖ, దేవస్థాన పాలక వర్గం బాధ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కంచనగుహపై నిర్మించిన ప్రధాన ఆలయం, లక్ష్మీదేవి, చెన్నకేశవస్వామి, క్షేత్రపాలకులు, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు ముఖద్వారానికి రంగులు, విద్యుదీకరణ పనులు ప్రారంభయ్యాయి. ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి, అర్చకులు వెంకటయ్య, లక్ష్మీనర్సింహ, అనంతవిజయ్ తదితరులు బుధవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారీగా బందోబస్తు...

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీ కురుమూర్తి స్వామివారి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ జానకి తెలిపారు. బుధవారం ఆలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఉద్దాల ఉత్సవానికి లక్షల్లో వచ్చే భక్తులకు, స్వామివారి బంగారు ఆభరణాల ఊరేగింపునకు ప్రత్యేక బలగాలతో పాటు, పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్సై శేఖర్ పాల్గొన్నారు.


జాతర మైదానంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

దోశ ముక్క గొంతులో ఇరుక్కొని మృతి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : దోశ తింటుండగా ఒక్కసారిగా గొంతులో ఇరుక్కోవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నివాసముంటున్న వెంకటయ్య (43) ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. 11 గంటల సమయంలో హోటల్ నుంచి దోశ తీసుకుని ఇంటికి వచ్చాడు. కుటుంబసభ్యుల ముందే తింటున్నాడు. గొంతులో ఇరుక్కోవడంతో నీళ్లు తాగుతుండగానే పక్కకు ఒరిగిపోయాడు. కళ్లెదుటే ప్రాణాలు వదలడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వెంకటయ్యకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.


వెంకటయ్య (పాతచిత్రం)

విద్యుదాఘాతానికి వృద్ధురాలు..


గోవిందమ్మ

రాజోలి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై రాజోలి గ్రామానికి చెందిన గోవిందమ్మ(62) మృతిచెందింది. స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లో వాటర్ హీటర్ పెట్టబోయింది. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. ఇంట్లో ఉన్న వారంతా గృహ ప్రవేశానికి వెళ్లడంతో ఎవరూ గమనించలేదు. పక్కింటి వ్యక్తి గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే వృద్ధురాలు మృతిచెందింది.

కోడి పందాలపై పోలీసుల కొరడా

12 కోడి పుంజులు.. 21 ద్విచక్రవాహనాలు స్వాధీనం

కోడేరు, న్యూస్‌టుడే : కోళ్ల పందెం ఆడుతుండగా సమాచారం రావడంతో స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి 12 కోడి పుంజులు, 21 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల బాడుగదిన్నె శివారులో చోటు చేసుకుంది. ఎస్సై గోకారి కథనం ప్రకారం.. వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 70 మందికిపైగా ద్విచక్రవాహనాలపై బాడుగదిన్నె శివారు పొలం వద్దకు చేరారు. రహస్యంగా కోడి పందాలు ఆడుతున్నారు. ఈ విషయంపై డయల్ 100కు సమాచారమందింది. ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ వెంటనే కొల్లాపూర్ సీఐ మహేశ్‌ను అప్రమత్తం చేశారు. దీంతో ఆయన కొల్లాపూర్, కోడేరు పోలీసులతో బృందంగా ఏర్పడి కోడి పందాలు ఆడుతున్న స్థావరంపై దాడులు నిర్వహించగా పందెంరాయుళ్లు పరారయ్యారు. 12 కోడిపుంజులు, 21 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని కోడేరు ఠాణాకు తరలించారు. ఈ ఘనటపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోకారి తెలిపారు. ఎలాంటి నగదు లభ్యం కాలేదని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ఒకరి మృతి

కోస్గి గ్రామీణం : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన గుండుమాల్ బుధవారం చోటు చేసుకుంది. బైక్‌మెకానిక్ కృష్ణయ్య రాత్రి దుకాణంలో పనులు ముగించుకొని ఇంటికి బయలుదేరాడు. మద్దూరు మండలం దోరెపల్లికి చెందిన మోహన్ తన ద్విచక్రవాహనంపై గుండుమాల్ వస్తున్నారు. ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్న కృష్ణయ్యను ఢీకొట్టాడు. కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. గాయాల పాలైన మోహన్‌ను కోస్గి ఆసుపత్రికి తరలించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

చెంచుల అభ్యున్నతికి చేయూత

లింగాల, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల్లో నివాసం ఉంటున్న చెంచుల్లో అక్షరాస్యత తక్కువ ఉన్నందుకు.. అభివృద్ధి సాధించ లేకపోతున్నారని ఎన్‌ఆర్ఐ ఝాన్సీ లక్ష్మి అన్నారు. నైస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రపెంటలో బుధవారం చెంచులకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. చెంచులు మద్యం తదితర దురవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి కుటుంబానికి రూ.3,500 విలువైన సరకులు అందజేశామని మొత్తం 80 మందికి లబ్ధి చేకూరిందని సంస్థ కార్యదర్శి పూర్ణచంద్రారావు వివరించారు. 5 ఏళ్లపాటు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ రాధ, మోక్ష తదితరులు పాల్గొన్నారు.


చెంచులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎన్‌ఆర్ఐ ఝాన్సీలక్ష్మి, నైస్ సంస్థ కార్యదర్శి పూర్ణచంద్రారావు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల మహాత్మ జ్యోతి బా పులే బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రిన్సిపల్ గురువయ్యగౌడ్‌తో కలిసి చిన్నారెడ్డి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో, చదువులో నైపుణ్యాన్ని, చిత్తశుద్ధిని ప్రదర్శిస్తే తమ లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ క్రీడాకారులు ఎంపిక కావాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన క్రీడా వందనాన్ని స్వీకరించారు. అనంతరం వాలీబాల్ క్రీడ ప్రారంభోత్సవం వాలీబాల్‌ను త్రో చేసి విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ సొసైటీ అధికారి హర్షవర్ధన్‌రెడ్డి, హాకీ వ్యాయామ డైరెక్టర్ కుమార్, ఎస్ఎంఎస్ ఛైర్మన్ రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

ఎక్లాస్‌పూర్ అడవుల్లో చిరుతల సంచారం

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ ఎకో పార్కు పరిసరాల్లో చిరుతలు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. 250 ఎకరాలకు పైగా ఆటవీప్రాంతం కోయిలకొండ వరకు గుట్టలు, చెట్లతో విస్తరించి ఉంది. ఇటీవల లేగదూడలు, మేకలు, ఆవులను చిరుతలు చంపుతున్నాయి. ఎకో పార్కులో ఓ చిరుత సంచరించడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. బుధవారం ఎకో పార్కు కమాన్ వద్ద బొమ్మ చిరుత వద్దకు అసలైన చిరుత చేరుకుని కాసేపు అక్కడే నిలిచిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' అటవీ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డితో ప్రస్తావించగా చిరుత సంచారం వాస్తవమేనన్నారు. ఎకో పార్కు ఆటవీ ప్రాంతంలో దాదాపు 10 నుంచి 15వరకు చిరుతలు ఉన్నట్లు ఆయన తెలిపారు. రైతులు, ప్రజలు ఒంటరిగా వెళ్లవద్దన్నారు. రాత్రి వేళల్లో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు

పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836

తెరపై ఈనాడు

దేవర: మనోహర్ 70 ఎంఎం(నారాయణపేట), వెంకటరమణ(మక్తల్), వనయాంజు(కోస్గి), శ్వాగ్: మహేశ్వర(నారాయణపేట), విశ్వం: రాఘవేంద్ర(మక్తల్)
-న్యూస్‌టుడే-పాతబస్టాండ్, మక్తల్ గ్రామీణం, కోస్గి న్యూటౌన్

కూరగాయల ధరలు(కిలోకు)



టమాట రూ. 70, వంకాయలు రూ. 60, ముల్ల వంకాయలు రూ80, ఆలుగడ్డ రూ. 50, కాకరకాయ రూ. 80, క్యారెట్ రూ. 80, బెండకాయలు రూ. 60, బీరకాయలు రూ. 80, దొండకాయలు రూ. 60, పచ్చిమిర్చి రూ. 50, చిక్కుడు రూ. 70, పెద్ద చిక్కుడు రూ. 80, గోరుకాయ రూ. 70, క్యాప్సికం 80, బీన్స్120, కాలీఫ్లవర్ రూ. 80, దోసకాయ రూ. 60, క్యాబేజీ రూ. 50, బీట్ రూ. 50, చింతపండు రూ. 110 - న్యూస్‌టుడే, నారాయణపేట (పాతబస్టాండ్)

రహదారి పనుల్లో నాణ్యత పాటించాలి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : బీటీ రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆర్‌అండ్‌బీ ఏఈ అఖిలా షిరెడ్డి అన్నారు. బుధవారం భూనాపూర్ సమీపంలో పనులు పరిశీలించారు. మక్తల్ నుంచి అనుగొండ రహదారికి మరమ్మతులు చేపడుతున్నామన్నారు. రూ.23.6లక్షలతో 24 కిలోమీటర్ల మేరకు పనులు చేస్తున్నట్లు చెప్పారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, గుత్తేదారు నర్సిములు, నాయకులు ఆశిరెడ్డి, నర్సిములు, కృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జిల్లా మాలల జేఏసీ ఛైర్మన్‌గా జి.హన్మంతు

దామరగిద్ద, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా మాలల జేఏసీ ఛైర్మన్‌గా జి.హన్మంతు(దామరగిద్ద) నియమితులయ్యారు. తనపై నమ్మకంతో నియమించిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు చెప్పారు.

నియోజకవర్గం పురోగతికి ముఖ్యమంత్రి కృషి

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజక వర్గం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని కడా అధికారి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మద్దూరు, జాదరావుపల్లి, రెనివట్ల, పల్లెర్ల, దోరేపల్లి గ్రామాలకు చెందిన 135 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా కొడంగల్‌లో ఉన్న కార్యాలయంలో తెలపాలని సూచించారు. దామరగిద్దపూర్ పీఏసీఎస్ ఛైర్మన్ నర్సిములు, కోస్గి మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమప్ప, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి, తహసీల్దార్ మహేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీరామ కాలనీ అభివృద్ధికి నిధులు

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : కోస్గి పట్టణంలోని శ్రీరామ కాలనీ అభివృద్ధి కోసం నిధులు మంజూరయ్యాయని వార్డు సభ్యురాలు తడుము మంజులశ్రీనివాస్ తెలిపారు. శివాజీ కూడలి నుంచి బిజ్జారపుబావులు వరకు ఎఫ్‌డీసీ నిధులతో వీధిదీపాలకు రూ. 42 లక్షలు, కాలనీలో బ్యాడ్మింటన్ కోర్టు కోసం రూ. 50 లక్షలు మంజూరయ్యాయన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలకు రూ. 2 కోట్లు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ముహూర్తం కుదిరేనా?



ధన్వాడలో పదేళ్లుగా మూతపడిన గృహనిర్మాణ శాఖ కార్యాలయం

గద్వాల, న్యూస్‌టుడే: గతంలో ఎవైఎ, ఇందిరమ్మ ఇళ్లు, పీఎంఏవై ఇలా నిరుపేదల గృహ నిర్మాణ పథకాలన్నీ ఒకే గొడుగు కింద ఉండేవి. అధికారులు, సొంత కార్యాలయాలతో గృహనిర్మాణ శాఖ కళకళలాడుతుండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గృహనిర్మాణ శాఖను అప్పటి ప్రభుత్వం పక్కన బెట్టేసింది. అందులో పని చేసే అధికారులను ఇతర శాఖలకు బదిలీ చేసింది. దీంతో సంబంధిత కార్యాలయాలకు తాళం పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అప్పట్లోని 64 మండల, 12 డివిజన్ గృహనిర్మాణ శాఖ కార్యాలయాలు మూతపడ్డాయి, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం వల్ల తిరిగి ఈ కార్యాలయాల తలుపులు తెరుచుకోనున్నాయనే ఆశాభావంతో ప్రజలున్నారు.

గృహలక్ష్మి అజమాయిషీ ఎవరికి: ప్రతి నియోజకవర్గానికి గృహలక్ష్మి పథకం కింద 3వేల యూనిట్లు(ఇళ్లు) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రతి పంచాయతీ పరిధిలో ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణ ప్రక్రియ మొదలుకానున్నాయి. దీంతో మళ్లీ గృహనిర్మాణ శాఖ పరిధిలోనే పనులు చేపడుతారా లేక డబుల్‌బెడ్ రూంల నిర్మాణ పనులు చేపట్టిన ఆర్.అండ్.బి ద్వారా వీటి పర్యవేక్షణ ఉంటుందా అన్నదానిపై స్పష్టత ఇంకా రాలేదు. అయితే ఆర్.అండ్.బి పరిధిలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న రోడ్లు, ఇతర నిర్మాణాల పర్యవేక్షణకే సిబ్బంది లేని పరిస్థితి ఉంది. తాజాగా గృహలక్ష్మి ఇళ్ల నిర్మాణం కూడా అప్పగిస్తే పర్యవేక్షణ ఆ శాఖ అధికారులకు మరింత భారం కానుంది. ఈ నేపథ్యంలో గృహనిర్మాణ శాఖ పునరుద్ధరణ వైపే ప్రభుత్వం మొగ్గు చూపే అవకాశం ఉందని జిల్లా స్థాయి అధికారులంటున్నారు.

పర్యవేక్షణ సిబ్బందే ముఖ్యం: గత ప్రభుత్వం నియోజకవర్గానికి వెయ్యి గృహాలు తొలి దశలో ఇవ్వాలని నిర్ణయించింది. తర్వాత మార్పులు చేసి 2వేల యూనిట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. మూడోసారి మార్పులు చేసి 3 వేల ఇళ్ల చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించింది. మంజూరు నాటికి ప్రభుత్వమే మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారుల్లో ఆశలు రేపింది. దీంతో స్థానిక ఎమ్మెల్యేలకు ప్రజలు ఈ విషయంపై ఒత్తిడి తెస్తున్నారు. డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా కేటాయింపుల్లో గందరగోళం తలెత్తి ఇబ్బందిగా మారిన క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో ఎమ్మెల్యేలకు కొంత వెసులుబాటు కలగనుంది.

ఉమ్మడి జిల్లాలో 36 వేల యూనిట్లు: ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలో 36 వేల యూనిట్లు రానున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో గృహలక్ష్మి పథకం కోసం రూ.1,800 కోట్లు నిధులు అవసరం అవుతాయి. ఇంత పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తున్న క్రమంలో ప్రత్యేక శాఖ, దానికి ఇంజినీరింగ్ విభాగం, ప్రత్యేక పర్యవేక్షణకు తగిన సిబ్బంది ఉండాలి. దానికి తోడు ప్రభుత్వం ఇంటి నిర్మాణ సొమ్ము మూడు విడతలుగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దానికంటూ ప్రత్యేక కార్యాలయాలు, ఆన్‌లైన్ వ్యవస్థ తగిన సిబ్బంది లేకుంటే పథకం డబుల్‌బెడ్ రూమ్‌ల మాదిరిగానే గాడి తప్పే పరిస్థితి ఉంటుంది.



గుడిగండ్లలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కార్యదర్శి చంద్రశేఖర్

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : మక్తల్ మండలం గుడిగండ్ల జిన్నింగ్ మిల్లు వద్ద బుధవారం పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి క్వింటాలు ధర రూ. 7,521 నిర్ణయించినట్లు తెలిపారు. తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉండాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో సీసీఐ అధికారులు రవి, కృష్ణారెడ్డి, మార్కెట్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



శిబిరంలో రక్తదానం చేస్తున్న పోలీసులతో ఎస్పీ యోగేశ్‌గౌతం, రెడ్‌క్రాస్ సభ్యులు

నారాయణపేట, న్యూస్‌టుడే: పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని ఎస్పీ యోగేశ్‌గౌతం అన్నారు. సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రెడ్‌క్రాస్ సౌజన్యంతో బుధవారం జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఎస్పీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ ప్రాణదాతలుగా నిలవాలన్నారు. శిబిరంలో పోలీసు సిబ్బంది, యువకులు కలిసి మొత్తం 35 యూనిట్ల రక్తదానం చేశారు. రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, ఆర్ఐ నర్సింహా, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మరికల్ కూడలి : పోలీసు అమర వీరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని మరికల్ ఏఎస్సై మసూద్ అన్నారు. బుధవారం ఇందిరాగాంధీ చౌరస్తా సమీపంలో పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసు కళాజాత ప్రదర్శన జరిగింది. సమాజంలో శాంతిని నెలకొల్పే క్రమంలో పలువురు పోలీసులు అమరులయ్యారని, వారి ఆశయాల సాధన కోసం అంతా కృషి చేద్దామన్నారు. ఈ సందర్భంగా కళాజాత బృంద సభ్యులు ఆట పాటల ద్వారా అమరుల కీర్తిని కొనియాడారు. సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, రుక్యానాయక్‌లతో పాటు స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నర్వ, న్యూస్‌టుడే : ప్రజలకు పోలీసులు చేరువ అయ్యేందుకు కృషి చేయాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ సూచించారు. బుధవారం నర్వ ఠాణాను ఎస్పీ సందర్శించారు. కేసుల నునెలల తరబడి పెండింగ్ పెట్టకుండా నిందితులకు శిక్ష పడే విధంగా నాణ్యమైన పరిశీలన చేయాలన్నారు. ఠాణా దస్త్రాలను చూసి ఒక్కో కేసు వివరాలను తెలుసుకున్నారు

మాదక ద్రవ్యాల బారిన పడొద్దు

మద్దూరు, న్యూస్‌టుడే: దేశం అభివృద్ధి చెందాలంటే యువత పాత్ర ముఖ్యమని, వారు మాదక ద్రవ్యాల బారిన పడకుండా తమను తాము కాపాడుకోవాలని ఎస్ఐ రాంలాల్ కోరారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎస్ఓ ఆధ్వర్యంలో మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ రాములు, సంఘాల నాయకులు మహ్మద్ అలీ, కన్కప్ప, మౌలాలి, నర్సప్ప, ఎల్లప్ప, సంజీవ్ పాల్గొన్నారు

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యం



చిన్నపొర్లకు పాదయాత్రగా వస్తున్న విశ్రాంత డీఈవో విజయ్‌కుమార్

ఊట్కూరు, న్యూస్‌టుడే : రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల భూసారం తగ్గి, మానవుడి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని అనుసరించాలని విశ్రాంత డీఈవో శివార్చక విజయ్ కుమార్ అన్నారు. అక్టోబర్ 2న అలంపూర్‌లో చేపట్టిన సత్య శోధన పాదయాత్ర బుధవారం చిన్నపొర్ల గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా యువకులు, గ్రామస్థులు , విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే నైతిక విలువలు పెంపొందించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. స్వదేశీ ఉత్పత్తులు వాడాలని కోరారు.. కార్యక్రమంలో ఎంఈవో రామచంద్రచారి, కాంగ్రెస్ నాయకుడు విఘ్నేశ్వర్ రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

రెనివట్లను పంచాయతీగా కొనసాగించాలని వినతి

మద్దూరు, న్యూస్‌టుడే: రెనివట్లను పంచాయతీగా కొనసాగించాలని కడా అధికారి వెంకట్‌రెడ్డికి గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. మద్దూరులో గ్రామాన్ని విలీనం చేసి పురపాలికగా ఏర్పాటు చేయరాదన్నారు. ప్రధాన రహదారి వెడల్పు చేసే క్రమంలో ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి, శంకర్, రాంగోవింద్, బసినంరాజు, మ్యాకల శ్రీనివాస్, యాసిన్, వెంకటేశ్, నర్శిములు, కమల్, సుక్కప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి భవనం అప్పగింత

అలంపూర్, న్యూస్‌టుడే: ప్రసాద్ పథకంలోని కింది అంతస్తులో నిర్మించిన బ్లాక్‌ను అలంపూర్ ఆలయాలకు అన్నదాన సత్రం కోసం పర్యాటక శాఖ డిప్యూటీ ఇంజనీర్ పరుషవేది బుధవారం ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డికి అప్పగించారు. ఈ బ్లాక్‌లో అన్నదాన సత్రం ఏర్పాటు చేసుకుని భక్తులకు అన్నదానం చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు అప్పగించారు.

ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడతానని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మక్తల్ ఎమ్మెల్యే నివాసానికి ముదిరాజ్ సంఘం నాయకులు ర్యాలీగా వెళ్లి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లో కలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి న్యాయం చేస్తానన్నారు. సంగంబండ జలాశయం సొసైటీని మక్తల్ ముదిరాజ్ సొసైటీలో విలీనం చేయడానికి కృషి చేస్తానన్నారు. నిరంతరం ముదిరాజ్‌లకు అండగా ఉంటూ పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కోళ్ల వెంకటేష్, చందాపురం చంద్రశేఖర్, వాకిటి అంజయ్య, మామిళ్ల కిష్టప్ప, తిరుపతి నర్సిములు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక



మేఘనకు పతకం అందిస్తున్న ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఈనెల 20న పట్టణంలోని కొత్తగార్లపల్లి రహదారిలో నిర్వహించిన పది కిలోమీటర్ల రోడ్‌స్పీడ్ సైక్లింగ్ పోటీల్లో మాద్వార్ గ్రామానికి చెందిన మేఘన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సైక్లింగ్ సంఘం కార్యదర్శి గోపాలం తెలిపారు. ఈ సందర్భంగా మేఘనకు ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి పతకం ఇచ్చి, అభినందించారు. వచ్చేనెల 4న జనగామలో జరిగే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో ఈమె పాల్గొంటారన్నారు.


కృష్ణా, న్యూస్‌టుడే : కృష్ణా మండల పరిధిలోని ముడుమాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అరవింద్, తరుణ్ రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మీనా కుమారి తెలిపారు. నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు జనగామ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. విద్యార్థులను కృష్ణా ఎంఈవో నిజామోద్దీన్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ప్రమాదకరంగా గుంతలు



జక్లేర్, గుడిగండ్ల, ఊట్కూరు మండలం పులిమామిడి, ఎడవెల్లి, ధన్వాడ, మరికల్ మండలాల్లోని పలు గ్రామాల్లో రైల్వేలైన్ ఏర్పాటు కోసం తీసిన మట్టి గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. అటు వైపు వెళ్లే బాటసారులు, రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత రెండేళ్లుగా వాటిలో ఆవులు, మేకలు పడి మృతిచెందాయని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు. ఈ గోతులకు కంచె ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా రైల్వే అధికారులతో మాట్లాడి కంచె ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నియంత్రిక చుట్టూ పొదలు




రామసముద్రంలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ ముళ్ల పొదలు ఏపుగా అలుముకున్నాయి. అక్కడికి వెళ్లిన మేకలు, పశువులు విద్యుదాఘాతానికి గురవుతున్నాయి. ఫీజులు వేసేందుకు ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ముళ్ల పొదలు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ రామకృష్ణను వివరణ కోరగా సిబ్బందితో మాట్లాడి తొలగిస్తామన్నారు. - న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం

ప్రమాదం అంచున ప్రయాణం



గ్రామీణ ప్రాంతాలకు ఎక్కువగా బస్సులు లేకపోవడంతో ఆటోలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రైవేటు వాహనదారులు మోతాదుకు మించి ప్రయాణికులను తీసుకెళ్తున్నారు. కోస్గి మండలం బిజ్జారంలో ఓ మూలమలుపులో ఆటోలో అధిక సంఖ్యలో ప్రయాణికులు తీసుకెళ్లడం కెమెరాకు చిక్కింది. ప్రమాదం అంచున ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోస్గి గ్రామీణం

రైతన్నపై పగబట్టిన వర్షం



వర్షం అన్నదాతల విషయంలో పగబట్టినట్లుగా కన్పిస్తోంది. పత్తి తడవకుండా రైతులు నానా అవస్థలు పడ్డారు. పత్తి అమ్మేందుకు తిప్రాస్‌పల్లి జిన్నింగు మిల్లు వద్దకు పత్తిలోడు వాహనాలను రైతులు తీసుకొస్తున్నారు. మక్తల్- నారాయణపేట రహదారి పక్కన వాహనాలు నిలుపుతున్నారు. మబ్బులు కమ్మేసి వర్షం రావటంతో రైతులు తమ వాహనాలను టార్పలీన్ కవర్లతో కప్పడం నిత్యకృత్యంగా మారుతోంది. - న్యూస్‌టుడే, ఊట్కూరు


వాయిదా పడ్డ దుకాణాల వేలం

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : మరికల్ పంచాయతీ దుకాణాల వేలం మళ్లీ వాయిదా పడింది. గతంలో దుకాణాలను స్వాధీనం చేసుకొని వేలం వేయాలని అధికారులు యత్నించగా దుకాణాల నిర్వహకులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఈ గడువు తీరుతున్న నేపథ్యంలో ఈ నెల 24న వేలం వేయాలని పంచాయతీ అధికారులు నిర్ణయించి తదనుగుణంగా చర్యలు చేపట్టారు. దీనిని గుర్తించిన దుకాణదారులు మరో సారి కోర్టుకు వెళ్లారు. కోర్టు రెండు వారాలు స్టే ఇవ్వడంతో గురవారం నిర్వహించాల్సిన వేలం పాటను వాయిదా వేయాల్సి వచ్చింది. పంచాయతీ సైతం స్టే తొలగింపునకు కోర్టును ఆశ్రయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి వెల్లడించారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఊట్కూరు, న్యూస్‌టుడే : సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపట్టకపోవటంతో రైతులు నష్టపోతున్నారని, వెంటనే కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. వెంకట్రాంరెడ్డి డిమాండ్ చేశారు. రెవెన్యూ కార్యాలయం వద్ద బుధవారం మండల నాయకులతో కలిసి నిరసన చేపట్టి, తహసీల్దార్ చింత రవికి వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రైవేటులో విక్రయిస్తే రైతులకు మద్దతు ధర లభించటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా నాయకుడు గోవింద్‌రాజ్, సీఐటీయూ మండల కన్వీనర్ బి.నారాయణ, రైతు సంఘం నాయకుడు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



గౌరవ వందనం స్వీకరిస్తున్న కల్వకుర్తి పుర అధ్యక్షుడు ఎడ్మసత్యం, అధికారులు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : చదువులతో పాటు క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పుర అధ్యక్షుడు ఎడ్మసత్యం అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి గురుకుల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేందుకు నిత్య సాధన చేయాలన్నారు. చిన్నతనం నుంచే గెలుపు ఓటములను అలవర్చుకుంటే జీవితంలో ఎలాంటి ఒడిదొడుకులు వచ్చినా తట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. పోటీలు నిర్వహించడం వల్ల ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్తుండటంతో అక్కడి పరిస్థితులు తెలుస్తాయని కొత్త మిత్రులు ఏర్పడతారన్నారు. ఓటమి చెందామని నిరుత్సాహపడకుండా గెలుపు కోసం ప్రయత్నించి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. అంతకు ముందు విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించి క్రీడా జ్యోతిని వెలిగించారు. పోటీలను ప్రారంభించి విద్యార్థులను పరిచయం చేసుకున్నారు.

భాజపా అధికారంలోకి వస్తేనే అభివృద్ధి



మంత్రోనిపల్లిలో నిర్వహిస్తున్న భాజపా సభ్యత్వ నమోదు

ధన్వాడ, న్యూస్‌టుడే : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కె. మల్లయ్య అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం మంత్రోనిపల్లిలో ఇంటింటికీ తిరుగుతూ పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కేంద్రంలోని ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే పాలకుల్ని ఎన్నుకుంటే దండిగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయవచ్చున్నారు. విదేశీ ముప్పును తొలగిస్తూ సుస్థిరతమైన దేశం కోసం భాజపాకు మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, బి.ఆంజనేయులు, వెంకటేశ్, సహదేవ్, తిరుపతి, బాల్‌రాజు, ప్రశాంత్, నరేశ్, గోపాల్, తిమ్మయ్య పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన డయల్ 100



యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : డయల్ 100 ద్వారా పోలీసులు ఓ యువకుడి ప్రాణాలు కాపాడిన ఘటన ఇది. పేట మండలం బండగొండ గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డిని తండ్రి మందలించాడు. మనస్తాపానికి గురైన శ్రీకాంత్ తాను చనిపోతున్నట్లు మంగళవారం రాత్రి 10 గంటలకు ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ కుమారుడు రాకపోవడంతో తండ్రి రాంరెడ్డి నారాయణపేట రూరల్ పోలీసులకు డయల్ 100 ద్వారా సమాచారం అందించారు. ఎస్సై రాముడు ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు గ్రామానికి చేరుకున్నారు. సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా శ్మశానవాటికలో ఉన్నట్లు

పీఎంజేవై బీమా చెల్లింపు

మద్దూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ మద్దూరు మేనేజర్ నవీన్‌కుమార్ కోరారు. మొమెన్‌పూర్‌లో అనారోగ్యంతో మరణించిన తిరుపతి కుటుంబ సభ్యులకు ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన కింద రూ.2లక్షల బీమా చెక్కును బ్యాంకు అధికారులు అందజేశారు. అధికారులు నాగేందర్‌నాయక్, ఎస్ వెంకటేశ్ పాల్గొన్నారు

యువక్లబ్బుల వివరాలు నమోదు చేయండి

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : యూత్ క్లబ్బుల వివరాలను నెహ్రూ యువ కేంద్రానికి చెందిన మై భారత్ యాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా సమన్వయకర్త అనిల్‌కుమార్ గౌడ్ కోరారు. బుధవారం మరికల్ వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మై భారత్ దైనందిని ఆవిష్కరణలో పాల్గొన్నారు. యువతకు కెరీర్ పరంగా నెహ్రూ యువక కేంద్రం తోడ్పడుతుందన్నారు .వికసిత భారత్ ఏర్పాటులో యూత్ క్లబ్బులు తమ వంతు సహకారం అందించాలన్నారు. మాజీ యువక మండలి అధ్యక్షుడు హరీష్, వికాస వేదిక సభ్యులు కాటికొండ ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, కాటెప్ప, ముస్తాఫ్ అన్సారీ, వెంకటేశ్వరరావు, మహేష్, రఘుపతిరెడ్డి, రాఘవేందర్, శేఖర్ అనీస్ అన్వర్, కమల్ తదితరులు పాల్గొన్నారు.



మై భారత్ దైనందిని ఆవిష్కరిస్తున్న అనిల్‌కుమార్ గౌడ్, తదితరులు

సూచికలు లేని మలుపులు.. ప్రమాద హేతువులు

న్యూస్‌టుడే, మద్దూరు





ప్రమాదకరంగా మద్దూరు-నిడ్జింత రహదారి • ఖాజీపూర్ మలుపు ఇలా..

జిల్లాలో పలు ప్రాంతాల్లోని రహదారుల మలుపులు ప్రమాద కారకాలుగా మారుతున్నాయి. ఖాజీపూర్ రహదారి చెరువు కట్ట మలుపులో ముందు వాహనం కనిపించక రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో రవి శంకర్ అనే వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదకర ప్రాంతాల్లో సూచికలు లేవు. రోడ్డు వేయడం పూర్తి కాగానే సూచికలు బిగించాలి. కానీ మద్దూరు, కోస్గి, దామరగిద్ద, ధన్వాడ మండలాల్లో రోడ్ల నిర్మాణపు పనులు చేపట్టినా సూచికలు ఏర్పాటు చేయలేదు. కొన్ని మలుపుల్లో ఇరువైపులా తుమ్మచెట్లు పెరిగి ముందు వచ్చే వాహనాలు కనిపించడం లేదు.

- మద్దూరు-నిడ్జింత, పెదిరిపాడు రహదారుల్లో మలుపులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్దూరు-పల్లెర్ల, నందిపాడు మార్గాల్లో మలుపులు సమస్యాత్మకంగా తయారయ్యాయి. గుండుమాల్ సమీపంలో మలుపులు ప్రమాదకంగా ఉన్నాయి. బోగారం సమీపంలో ప్రమాదాలకు ఆస్కారంగా మలుపు ఉంది. కోస్గి-సర్జఖాన్‌పేట, కోస్గి-దౌల్తాబాద్ రహదారుల్లో మలుపులు ప్రమాదాలకు స్వాగత ద్వారాలుగా మారుతున్నాయి. దామరగిద్ద మండలం కాన్‌కుర్తి మార్గంలో మూలలు వాహనచోదకులకు పరీక్ష పెడుతున్నాయి. లోకుర్తి రోడ్డు ఇరుకుగా ప్రమాదభరితంగా మారింది. అయ్యావారిపల్లి గేటు దగ్గర మలుపు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్నట్లు ఉంది. మలుపు దగ్గర పోలీసులు డ్రమ్‌లను రోడ్డుపై ఏర్పాటు చేసి నియంత్రిస్తున్నరు.
- ముగ్దుంపూర్-బిజ్వార్, ముగ్దుంపూర్-ఊట్కూరు, బిజ్వార్-అవుసులోనిపల్లి, అవునులోనిపల్లి-పెదజట్రం రహదారుల్లో అడుగుకో మలుపు ప్రయాణికులకు పరీక్ష పెడుతోంది.
- రహదారుల్లో సూచికల ఏర్పాటుపై నారాయణపేట పంచాయతీరాజ్ ఉప ఈఈ విలోక్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా సాధ్యమైనంత త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.

మద్యం మత్తులో ఉరేసుకుని మృతి

మద్దూరు, న్యూస్‌టుడే: కొత్తపల్లి మండలం ఎక్కామెడ్‌లో మద్యం మత్తులో హరిజన్ చంద్రప్ప(40) ఉరేసుకుని మరణించాడు. ఎస్ఐ రాంలాల్ కథనం ప్రకారం చంద్రప్ప ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల గొడవపడ్డాడు. ఆమె పుట్టింటికి వెళ్లిపోవటంతో మంగళవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించాక మద్యం మత్తులో ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

మేట్‌లను క్షేత్ర సహాయకులుగా గుర్తించండి



డీఆర్డీవో మొగులప్పకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సీనియర్ మేటీలను క్షేత్ర సహాయకులుగా గుర్తించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, అధ్యక్షుడు బాలప్ప, సీఐటీయూ కార్యదర్శి బలరాం అన్నారు. బుధవారం డీఆర్డీవో మొగులప్పకు వినతి పత్రం అందించారు. ఐదేళ్లుగా క్షేత్ర పరిశీలకులు లేని గ్రామాలలో సీనియర్ మేటీలే కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారని, వారిని క్షేత్ర సహాయకులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేటీల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, యూనియన్ నాయకులు లక్ష్మయ్య, నాగరాజు, అఫ్సర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

పేదలకు రెడ్‌క్రాస్ చేయూత



కిట్లు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుదర్శన్‌రెడ్డి, సదాశివరెడ్డి

దామరగిద్ద, న్యూస్‌టుడే : మారుమూల గ్రామాల్లో ఆపద సమయంలో పేదలను ఆదుకోడానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పలు సేవా కార్యక్రమాలు చేస్తోందని నారాయణపేట రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ సుదర్శన్‌రెడ్డి, పేట మార్కెట్ ఛైర్మన్ సదాశివరెడ్డి అన్నారు. బుధవారం దామరగిద్దలో బాధితులకు సహాయం అందించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు దెబ్బతిన్న 31 మంది బాధితులకు రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ పంపిన వస్త్రాలు, పళ్లాలు, గ్లాసుల కిట్‌ను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ కె.హనుమంతు, ఎంపీడీవో సాయిలక్ష్మి, ఎంఈవో కృష్ణారెడ్డి, మండల రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మందపైకి దూసుకొచ్చిన టిప్పర్

19 మేకపిల్లల మృత్యువాత

జోగిపేట న్యూస్‌టుడే: ఆందోలు మండలం సంగుపేట శివారులో 161వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం మేకల మందపైకి టిప్పర్ దూసుకెళ్లింది. ఈ ఘటనలో 19 మేక పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. పలు జీవాలకు గాయాలయ్యాయి. నారాయణపేట జిల్లా నుంచి సంగారెడ్డి జిల్లా సంగుపేటకు మేకల మంద వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతిచెందిన మేక పిల్లల విలువ సుమారు రూ. 80 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని కాపరులు కోరారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని జోగిపేట పోలీసులు తెలిపారు.